AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

6-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఐకేపీ ఆధ్వర్యంలో రికవరీ టీంలు ఏర్పాటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డి పేట్ మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో క్లస్టర్ల వారీగా రికవరీ టీంలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ద్వారా తీసుకున్న రుణా లను చెల్లిస్తే తిరిగి రుణాలు తిరిగి పొందవచ్చని అధికారులు పేర్కొ న్నారు. సంఘ సభ్యులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. రికవరీ డ్రైవ్‌లో ఏపీఎం, బ్యాంక్ మేనేజర్, సీసీలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరిన సీఎం హామీ..

**రేపు చిన్నమల్లారెడ్డిలో రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం**



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి 2023 మార్చి 18న పాదయాత్ర చేపట్టారు. కామారెడ్డి నుంచి రాజాంపేట వెళ్తున్న క్రమంలో చిన్నమల్లా రెడ్డి గ్రామంలో కురిసిన భారీ వర్షాలకు చిట్యాల రాజమని, భిక్కనూరు లక్ష్మిలకు చెందిన నివాసగృహాలు కూలిపోయాయి. పాదయాత్ర సందర్భంగా నిరాశ్రయులైన బాధితులు తమ ఆవేదనను రేవంత్ రెడ్డికి వివరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, నియోజకవర్గంలో మొ ట్టమొదటి ఇందిరమ్మ ఇళ్లు వారికే మంజూరు చేస్తానని హామీఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం బాధితులకు ఇళ్లు మంజూరు కావడంతో పాటు ఇళ్ల నిర్మాణం కూడా పూర్తయింది. శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా గృహప్రవేశం చేయనున్నారు.

## సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లోసృజనాత్మకత పెం పొందుతుందని.. కొత్త ఆవిష్కరణలు వస్తాయని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని జీవదాన్ పాఠ శాలలో శుక్రవారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారుచేసిన ప్రయోగా లను వీక్షించి, అభినందించారు. 'మిసైల్ మెన్'గా పేరు పొందిన ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సిద్ధిరాంరెడ్డి సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి భావి భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చదువుతోనే సమాజంలో మనిషికి గుర్తింపు ఉంటుందన్నారు. సైంటిస్టులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో పాఠశాల ఫాదర్ ప్రిన్సిపాల్ బాబు, జోబిష్, సనూఫ్, శ్రీకాంత్, మేరి కుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ చేపట్టింది. ఇందులో ప్రతి వారం ఒక్కో అంశం మీద పనులపై పర్యవేక్షణ చేస్తూ చర్యలు చేపట్టనుంది. ఈ క్రమంలో మున్సిపాలిటీలలో అధికారుల తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి మున్సిపాలిటీలో అధికారులకు, కౌన్సిలర్లకు మధ్య సమన్వయ లోపం ఉన్నట్టుగా తెలుస్తోంది.

**- అక్షరటుడే, కామారెడ్డి**

# కొరవడిన సమన్వయం

- కామారెడ్డి బల్దియాలో సమస్యల తిష్ట
- పట్టించుకోని అధికారులు
- 99 రోజుల ప్రణాళిక మొదటి రోజే సమన్వయ లోపం

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 19, బీజేపీ 16, బీఆర్ఎస్ 11 కౌన్సిలర్ స్థానాలు గెలుచుకోగా స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు గెలిచారు. బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే బల్దియాలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడినట్టుగా ప్రచారం సాగుతోంది. అధికార పార్టీకి చెందిన కౌన్సి లర్లకే అధికారులు పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**పారిశుధ్యంపై పట్టింపు కరువు**

మున్సిపాలిటీలో దాదాపు అన్ని వార్డులలో సమస్యలు తాండవిస్తున్నాయి. ముఖ్యంగా శానిటేషన్‌పై పర్యవేక్షణ కరువైంది. చెత్త సేకరణ వాహనాలు వార్డుల్లో తిరగడం లేదని కౌన్సిలర్లు చెబుతున్నారు. ఈ క్రమంలో సమస్య చెప్పుకోవడానికి వస్తే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మొదటిరోజే రసాభాస**

'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించింది. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి మొదటి రోజు ప్రతిజ్ఞ చేయించారు. అయితే అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా అవమానించారని మున్సిపల్ కౌన్సిలర్లు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇదేనా ప్రజాప్రతినిధులుగా తమకు ఇచ్చే గౌరవం అంటూ మండిపడ్డారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. దాంతో అధికారులు, నాయకుల మధ్య సమన్వయ లోపం మొదటిరోజే బయటపడింది. దాంతో 99 రోజుల పాటు ఈ కార్యక్రమంపై నీలినీడలు అలుము కున్నాయి.

**ఐదేళ్లపాటు ఎలా ఉంటుందో?**

మున్సిపాలిటీలో 49 వార్డులుండగా దాదాపు 60 శాతానికి పైగా కౌన్సిలర్లు కొత్తవాళ్లే ఎన్నికయ్యారు. వీరికి సమస్యల పట్ల, రాజకీయాల పట్ల అవగాహన తక్కువ అనే టాక్ ఉంది. నూతన పాలకవర్గం ఏర్పాటయ్యాక ఇప్పటివరకు కూడా ఒక్కసారి కూడా అధికారులతో సమావేశం నిర్వహించలేదు. కనీసం పరిచయ కార్యక్రమం కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిస్థితులు ఇలాగే ఉంటే ఐదేళ్ల పాటు ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## మహిళలకు సమానావకాశాలతో సమాజాభివృద్ధికి కృషి: సీతక్క

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మహిళలకు అవకాశాలు ఇవ్వడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడతామని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నగరంలోని విజయలక్ష్మి గార్డెన్‌లో ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా 2026లో 'గివ్ టు గైన్' అన్న నినాదాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. మహిళలకు సమాన అవకాశాలను ఇచ్చి నట్లయితే వారు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తారని తెలిపారు. మహిళా సాధికారత సాధించడంలో లింగ విభేదాన్ని విడనాడాలన్నారు. 'గివ్ టు గైన్' అన్న ని నాదాన్ని సార్థకత చేసుకుంటూ సమాజంలోని ప్రతిఒక్కరూ మహిళా సాధికారతకు పాటుపడదామని పిలుపునిచ్చారు. మహిళలు తమ కుటుంబాల అభివృద్ధికి చదువే మూలం అని గ్రహించాలని సీతక్క పేర్కొన్నారు. మహిళా అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని అన్నారు. చదువు విజ్ఞానాన్ని ఇస్తుందని ఈ విజ్ఞానంతో సమాజంలో రాణిస్తామని అన్నారు. ప్రతి విద్యార్థిని ఒక ఆదర్శవంతమైన వ్యక్తిని ఆదర్శంగా



తీసుకొని ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ , అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మేయర్ కె.ఉమారాణి, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కన్వీనర్ డీసీపీ(అడ్మిన్) జి.బస్వా రెడ్డి, ట్రెజరర్ కె.సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కవితారెడ్డి, ఎన్ఎస్ పీ సభ్యులు కాకతీయ కళాశాల అధినేత రజినీకాంత్, కామారెడ్డి సబ్ డివిజన్ ఏసీపీ చైతన్య రెడ్డి, కామారెడ్డి డీఎఫ్‌వో నిఖిత, నుడా ఛైర్మన్ కేశ వేణు, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** అత్యవసర సమయంలో చురుకుగా స్పందించి పోలీసులు ప్రశంసలు అం దుకుంటున్నారు. తాజాగా ఆత్యహత్నాయత్నం చేసుకుంటున్నట్లు సమాచారం అందిన క్షణాల్లోనే స్పందించి ప్రాణాలు కాపాడారు. భిక్కనూరులో గురువారం రాత్రి ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహ త్యాయత్నం చేస్తున్నట్లుగా డయల్ 100కు కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది క్షణాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడి ఇంటికి వెళ్లి తలుపులు బద్దలుకొట్టారు. ఉరివేసుకున్న బాధితు డికి కిందికి దింపారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న బాధితుడికి సీపీఆర్ చేశారు. ప్రాణాలు కాపాడారు. ఆపద సమయంలో సమాయస్ఫూర్తి ప్రదర్శించి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది వినయ్ కుమార్, రామాంజనేయులును ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

## ఎస్టీ బాలికల కళాశాల, హాస్టల్‌ను సందర్శించిన ఎంఈవో



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఎస్ఆర్ ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న ఎస్టీ గర్ల్స్ కాలేజీ హాస్టల్‌ను బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ రావు సందర్శించా రు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, నిర్వహణ విధానాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్‌లోని టాయిలెట్స్, కిచెన్, డైనింగ్ హాల్, ప్లే గ్రౌండ్ తదితర సౌకర్యా లను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. అలాగే హాస్ట ల్‌లో పరిశుభ్రత, ఆహార తయారీ విధానం, విద్యా ర్థినులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలు సుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అర్చన పాల్గొన్నారు.

## ప్రజా సేవకే అంకితమవ్వాలి..: ఎంపీ ఈటల

**అక్షరటుడే, ఇందూరు:** గెలుపు గర్వంతో కాకుండా ప్రజాసేవ కే అంకితమవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ కౌన్సిల ర్లు, కార్పొరేటర్లకు సన్మాన కార్యక్రమాన్ని నగర శివారులోని కమ్మ సంఘంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు హుందా గా వ్యవహరించాలన్నారు. గెలుపు గర్వంతో ముందుకు వెళ్లే భవిష్యత్తు రాజకీయం అంధకారమవుతుందన్నారు. అలాగే ప్రజలకు సేవ చేసినప్పుడు గుర్తింపు వస్తుందన్నారు. రాజకీ య చరిత్రలో రైతులతో పెట్టుకున్న ఏ పార్టీ కూడా బతికి బట్ట కట్టలేదని మల్కాజ్‌పురి ఎంపీ ఈటల పేర్కొన్నారు. ఒకప్పు డు బీఆర్ఎస్ విర్రవీగిన తనంతో ముందుకు వెళ్లింద న్నారు. ప్రజలు, రైతులను, ఉద్యోగులను పట్టించుకోకుండా అహం కారపూరిత పాలన చేసిందన్నారు. చివరికి ఆ పార్టీలో మట్టి లో కలిసిపోయిందన్నారు. తాను అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపె ట్టిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న డీఎస్ మాట్లాడుతూ ఒకప్పుడు తన రాజకీయ గురువైన అర్గుల రాజారాం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఈటల బడ్జెట్ పోలి ఉందని కితాబునిచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి కీ డీఎస్ హుందాతనం ప్రదర్శించేవారన్నారు. ప్రతిపక్షం



అంటేనే విమర్శించడం కాదని.. అధికార పక్షం అటే అధికా రం చూపడం మాత్రమే కాదన్నారు. హుందా రాజకీయాలు ఇందూరు పార్లమెంట్‌ను చూసి నేర్చుకోవాలని ఎంపీ ధర్మపు రి అర్వింద్ అన్నారు. తెలంగాణ మొత్తంలో నిజామాబాద్ లోనే అత్యధిక కార్పొరేటర్ కౌన్సిలర్ సీట్లు బీజేపీ గెలిచిందని స్పష్టం చేశారు. తాము ఎవరిని కొనుక్కొని రాజకీయాలు చే యమన్నారు. హిందువులలో అత్యధిక కార్పోరేటర్ సీట్లను తాము గెలిచామని, మిగిలిన వాటిని కాంగ్రెస్, ఎంఐఎం కు మ్మక్కై మేయర్ సీటును కైవసం చేస్తుందన్నారు. అంతేకానీ ప్రజల ఆశీర్వాదంతో మేయర్ సీటును అందుకోలేదన్నారు. తాము ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నా రు. గతంలో బీఆర్ఎస్ కూడా ఇలాగే చేసిందని గుర్తు చేశా రు. కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో కూడా రోజులను తగ్గించ డం, ప్రశ్నించే వారిని అణగదొక్కడం చేసిందన్నారు. రాబో యే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ బీజేపీ తన సత్తా చాటు తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్లు, కార్పొ రేటర్లను సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, జిల్లా ప్రబారి కాంతారావు, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొన్నారు.

## కామారెడ్డిలో మున్సిపల్ అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం..




**అక్షరటుడే, కామారెడ్డి:** కొత్తగా ఏర్ప డిన పాలకవర్గ సభ్యులకు కనీస సమా చారం ఇవ్వరా..? ఇదేనా మాకు మీరిచ్చే గౌరవం..' అంటూ.. మున్సిపల్ నూతన పాలకవర్గ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారు లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం 99 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం మొదటిరోజే రసాభాసగా మారింది. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శుక్రవారం ఉదయం రావాల్సిందిగా గురువారం రాత్రి కౌన్సిలర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు. కొంతమందికి వార్డు ఆఫీసర్లు ఫోన్‌చేసి సమాచారమిచ్చారు. అయితే ఆహ్వానం మేరకు మున్సి పల్ కార్యాలయానికి వచ్చిన కౌన్సిలర్లకు సరిపడా కుర్చీలు వేయలేదు. టెంటు కూడా సగం మందికే సరిపోయేలా ఏర్పాటు చేశారు. ఎండలో కుర్చీలు వేసి ఉండడం, టెంట్ సరిగా లేకపోవడం, కౌన్సిలర్ల మాట ఎత్తకుండా సమావేశం ప్రారం భించడం పట్ల కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం గెలిచాక ఇప్పటివరకు ఒక్క సమావేశమైనా ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారా అంటూ కమిషనర్‌ను నిలదీశారు. సమస్యలు చెప్పడానికి వస్తే కనీస స్పందన కూడా ఉండడం లేదని, ఇన్‌వార్డు సెక్షన్‌లో ఫిర్యాదు చేస్తే తీసుకునే పరిస్థితి కూడా లేదని మండిపడ్డారు. వార్డుల్లో శానిటేషన్ పరిస్థితి గందరగోళంగా ఉందని, చెత్త వాహనాలు సరిగ్గా రావడం లేదని, ఇలా అయితే ప్రజలకు తాము సమాధానం ఏం చెప్పుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వరా అంటూ మం డిపడ్డారు. అధికారుల తీరును నిరసిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. కమిషనర్, ఛైర్‌పర్సన్ బతిమాలినా వినిపించుకోకుండా సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ కౌన్సి లర్లు మాత్రమే ఉండగా ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ముగించారు.

# ఎల్లారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేద్దాం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భాగ్యవతి పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 99 రోజుల కార్యచరణ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి అభివృద్ధికి కృషిచేద్దామని మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి భాగ్యవతి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక'ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సహకారంతో మున్సిపల్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అన్ని వార్డుల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, తిరుపతి, గఫార్, దశరథ్, చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్యాం, రఫీక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌సీఈఆర్‌టీని బలోపేతం చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థను అత్యున్నత పరిశోధనా సంస్థగా తీర్చిదిద్దాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలయ్య, భీమ్‌గల్ మండల అధ్యక్షులు జాన్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గట్టు ఈశ్వర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యా నాణ్యత అనేది ఎస్సీఈఆర్టీ విశ్వసనీయతపైనే ఆధారపడి ఉంటుందని వారు స్పష్టం చేశారు. కేవలం డిగ్రీ, బీఈడీ ఉన్నవారిని కాకుండా, పీహెచ్‌డీతో పాటు పరిశోధనా అనుభవం ఉన్న విద్యావేత్తను డైరెక్టర్‌గా నియమించాలన్నారు. విద్యా ప్రణాళికలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలంటే డైరెక్టర్ సహా ఫ్యాకల్టీ సభ్యులు ఏడాదికి 20 రోజులు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేయాలని.. అద్దె భవనాల్లో ఉన్న ఎస్‌సీఈఆర్టీకి 100 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక వసతులతో శాశ్వత క్యాంపస్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ, డైట్‌లలో ఖాళీగా ఉన్న 95శాతం పోస్టులను విద్యా పరిశోధనల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.



జిల్లాలో వన్యప్రాణులు అటవీ ప్రాంతాన్ని వీడి జనావాసాల్లోకి రావడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. తాజాగా కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలోని కోనాపూర్ సెక్షన్ ఇనాయత్ నగర్ బీట్‌లో పులి పాదముద్రలు కనిపించడం కలకలం రేపింది. ఈ పాదముద్రలు మనాల సరిహద్దు వైపు వెళ్లినట్లు అటవీ అధికారులు గుర్తించారు. పులి కదలికలపై నిఘా ఉంచేందుకు అధికారులు ఇప్పటికే మూడు ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు.

– అక్షరటుడే, భీమ్‌గల్



# అడవి వీడుతున్న వన్యప్రాణులు

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దని సూచనలు..

### అటవీశాఖ హెచ్చరికలు..

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అటవీ రేంజ్ అధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు. పొలాలకు లేదా అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలి. వన్యప్రాణుల నుంచి రక్షణ కోసం పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం చట్టరీత్యా నేరం. ఇది మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. రాత్రి వేళల్లో గ్రామస్థులు బయటకు రాకుండా ఉండాలని, పులి లేదా చిరుత జాడ కనిపిస్తే వెంటనే 1926 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా అధికారులకు సమాచారం అందించాలని అటవీ అధికారులు కోరారు.

జిల్లాలో వన్యప్రాణులు గ్రామాలపైకి రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన పలు సంఘటనలు జిల్లావాసులను వణికిస్తున్నాయి. 2025 ఫిబ్రవరిలో నవీపేట మండలం అబ్బాపూర్‌లో చిరుతపులి ఒకే రాత్రి రెండు దూడలపై దాడిచేసి చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. గతంలో మోకన్‌పల్లిలోనూ చిరుత బహిరంగంగా తిరుగుతూ కుక్కలను వేటాడడంతో గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. గతే డాది ఆగస్టులో డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామంలో చిరుతపులి పశువుల పాకపై దాడి చేసి ఒక ఆవును హతమార్చింది. ఆర్మూర్ సమీపంలోని సిద్ధులగుట్ట ప్రాంతంలో జాతీయ రహదారిపై చిరుత సంచరించడం ప్రయాణికులను బెంబేలెత్తించింది.

### ఎలుగుబంట్లు సైతం..

ఎడపల్లి మండలం కుర్నాపల్లిలో చెరువు వద్దకు వెళ్లిన బాలుడిపై ఎలుగుబంటి దాడిచేసి గాయపరిచిన ఉదాహరణలున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో కొన్ని రోజులవరకు రాత్రివేళ్లలో ప్రజలు బయటకు రావడానికే భయపడ్డారు. అనంతరం ఎలుగుబండి ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

కామారెడ్డి జిల్లాలో వన్యమృగాల సంచారం గతంలో భిక్కనూరు మండలం గంధర్వపల్లి శివార్లలో చిరుతపులి పశువుల మందపై దాడిచేసి దూడను చంపేసింది. ఈ ఘటనతో స్థానిక రైతులు పొలాలకు వెళ్లాలంటేనే భయపడిపోయారు. అటవీశాఖ అధికారులు అక్కడ బోను ఏర్పాటు చేసి నిఘా పెట్టిన సందర్భం జిల్లాలో అప్పట్లో పెద్దచర్చకు దారితీసింది.

### గాంధారి అడవుల నుంచి గ్రామాల్లోకి..

గాంధారి మండలంలోని అటవీ ప్రాంతం దట్టంగా ఉండడంతో ఇక్కడ తరచూ చిరుతలు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వస్తుంటాయి. గతంలో గాంధారి శివార్లలో ఒక ఎలుగుబంటి గ్రామస్థులపై దాడి చేయడానికి ప్రయత్నించగా, వారు తప్పించుకున్నారు. అడవి పందుల వేట కోసం పెట్టిన ఉచ్చుల్లో చిరుతలు చిక్కుకున్న ఘటనలు కూడా ఇక్కడ నమోదయ్యాయి. దోమకొండ మండలంలోని మైసమ్మ ఆలయం పరిసరాల్లో, సమీప గ్రామాల్లో చిరుత సంచారం గతంలో కలకలం రేపింది. భక్తులు, స్థానికులు వెళ్లే దారిలో చిరుత కనిపించడంతో అటవీ శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

### నాగిరెడ్డిపేటలో పశువుల మందపై పంజా..

నాగిరెడ్డిపేట మండల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లోకి చిరుత వచ్చి మేకలు, గొర్రెలపై దాడి చేసిన ఉదాహరణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో పశువుల పాకల వద్దకు మృగాలు రావడంతో రైతులు రాత్రి కాపలా వెళ్లడానికి జంకారు. ముఖ్యంగా అడవులకు సమీపంలో ఉన్న గ్రామాలపై పంజా విసురుతున్నాయి.

### నీళ్లు లేకపోవడంతో..

ఉమ్మడి జిల్లాల్లో అటవీ ప్రాంతాలు విస్తరించి ఉన్న నేపథ్యంలో, అడవుల్లో నీటి కుంటలు ఎండిపోవడమే మృగాలు జనావాసాల వైపు రావడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. గతంలో జరిగిన పశువుల మరణాలు, దాడుల అనుభవాల దృష్ట్యా అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ, అడవుల్లో కృత్రిమ నీటి తొట్లు నింపే ప్రయత్నం చేస్తున్నారు.

# ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై సమావేశం



**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్ తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు పనులపై చర్చించి తీర్మానాలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీల్లో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఐకేపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు దోమకొండ హిస్టరీ లెక్చరర్ మేఘరాజ్ ప్రోత్సాహకంగా 139 పరీక్షప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేసిన లెక్చరర్‌ను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. జీవితంలో తొలి మెట్టయిన పదో తరగతి పరీక్షలను విజయవంతంగా రాయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే,భీమ్‌గల్:** మండలంలోని రహత్ నగర్ గ్రామానికి చెందిన భూక్య బాలుకు సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితుడి కుటుంబ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఆయన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.2లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి బాధితులకు అందజేశారు. ఆపద సమయంలో ఆర్థిక సాయం అందించి తమకు అండగా నిలిచిన ముత్యాల సునీల్ కుమార్‌కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ బెస్ట్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీగా మహమ్మద్ రఫీ గౌహర్



**అక్షరటుడే, ఆర్మూర్:** లయన్స్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో లయన్ మహమ్మద్ రఫీ గౌహర్ బెస్ట్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ అవార్డు ప్రదానం చేశారు. 15 క్లబ్బులు కలిగిన రీజియన్‌కు చెందిన ఈ రీజినల్ కాన్ఫరెన్స్‌ను రీజియన్ చైర్మన్ రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ లయన్స్ క్లబ్‌లైన ఆర్మూర్ నవనాథపురం, ఆర్మూర్ గ్రీన్, నిర్మల్, నిర్మల్ వారియర్స్, బాల్కొండ, బాల్కొండ ఫోర్ట్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి తదితర క్లబ్బుల సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ పి. బసవేశ్వరరావు, పీడీజీలు పెంటయ్య, లయన్ వీరేశం పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆర్మూర్ పట్టణ పోలీసులు గుర్తించారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వీఆర్ కాంప్లెక్స్ మల్టీప్లెక్స్ సెల్లార్‌లో ఒక గుర్తు తెలియని మగవ్యక్తి మృతి చెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. స్పందించిన వారు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కమ్మర్‌పల్లి విద్యార్థులు



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై సత్తా చాటారు. 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలబాలికల విభాగంలో ఆర్.రిశ్వంత్, షర్విణి (7వ తరగతి), రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు పాఠశాల పీడీ వేముల నాగభూషణం తెలిపారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు జెడ్పీ పాఠశాలలో ఈ పోటీలు జరగనున్నాయి. జనవరిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వీరు, ఈ నెల 3 నుంచి సుద్దపల్లి, తోర్లికొండల్లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో పాల్గొని తుది జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపికపై హెచ్ఎం పసుపుల సాయన్న, సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు




**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీలు చేశారు. డివిజన్‌లో 8వ రోజు జరుగుతున్న పరీక్షల్లో భాగంగా శుక్రవారం 12 పరీక్ష కేంద్రాల్లో 3,035 విద్యార్థులకు గాను 2,954మంది విద్యార్థులు హాజరయ్యారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఫహీం ఉద్దీన్ బృందం పాల్గొందని ఇంటర్ విద్యాధికారి రవి కుమార్ తెలిపారు.

# భీమ్‌గల్ పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యసేవలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమ్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు తరలివచ్చి రోగులకు వైద్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ ప్రియాంక, ఆప్తాల్మజీ డాక్టర్ ఇర్షాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ అర్చన, పీడియాట్రిక్ డాక్టర్ ప్రవీణ్, డెంటిస్ట్ డాక్టర్ సల్మాన్, ఆర్థోపెడిక్ డాక్టర్ సంకీర్తనలు రోగులను క్షుణ్ణంగా పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్, పీవోఎంసీహెచ్ డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు అజయ్ పవర్, అజ్మతున్నీసా బేగం, శరత్ చంద్ర, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఐకేపీ జిల్లా డీపీఎం సూదాం వెంకటేష్, సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేశారు. శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

# మద్యం దుకాణాలను బంద్ చేయాలి



**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్ల గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌లను మూసివేయాలని సర్పంచ్ పటేల్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. వెల్లుట్ల గ్రామ సభలో మద్యం దుకాణాల నిర్వహణపై అసంతృప్తి చేశారు. గ్రామంలో యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండేందుకు మద్యం దుకాణాలను నిలిపివేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొగ్గుల సాయిలు, గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ గంట సాయిలు, జక్కుల సంతోష్ కుమార్, కమ్మరి భాస్కర్, నగేష్ గౌడ్, బెగరి రవి, గౌతం, ఓట్లం రవి, కృష్ణ, లింగపురం సాయిలు, పోతుగంటి సాయిలు, వార్డు మెంబర్స్ నాగరాజు, కుమ్మరి సాయిలు పాల్గొన్నారు.

# గోనుగొప్పులలో 'ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక' ప్రారంభం



**అక్షరటుడే, భీమ్‌గల్:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్థులు బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా అనారోగ్య సమస్యలను దరిచేరనివ్వకుండా జాగ్రత్త పడాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఈ ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.